# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **కేంద్ర, రాష్ట్రాల మధ్య గవర్నర్లు పటిష్టమైన వారధిగా వ్యవహరించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు.**

2. **సరుకు రవాణా వ్యవస్థ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి 8 ముఖ్యమైన జాతీయ హై-స్పీడ్ రహదారి కారిడార్ ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.**

3. **ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం తగ్గించిన రాజధాని ప్రాంత పరిధిని మళ్లీ పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

4. **తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలకు సంబందించిన 2024-25 జాబ్ క్యాలెండర్‌ను రాష్ట్ర శాసనసభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.**

5. **ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి ఉప ఎన్నికలో వైసీపీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణను ఆ పార్టీ ప్రకటించింది.**

6. **ఈరోజు జాతీయ అవయవ దాన అవగాహన దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**

==========================

కేంద్ర, రాష్ట్రాల మధ్య గవర్నర్లు పటిష్టమైన వారధిగా వ్యవహరించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రెండు రోజుల రాష్ట్రాల గవర్నర్ల సదస్సును ఆమె నిన్న ప్రారంభించారు. ఈ సదస్సులో అన్ని రాష్ట్రాల గవర్నర్లు, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. జాతీయ లక్ష్యాల సాధనకు కీలకంగా ఉపకరించే అంశాలపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాతావరణ మార్పు, గ్లోబల్ వార్మింగ్ వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. అమ్మ పేరుతో ఒక చెట్టు నాటే కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మలిచేందుకు గవర్నర్లు కృషి చేయాలని కోరారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఈ సందర్భంగా ప్రసంగించారు.

-------------------------

సరుకు రవాణా వ్యవస్థ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి 8 ముఖ్యమైన జాతీయ హై-స్పీడ్ రహదారి కారిడార్ ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్

తెలిపారు. నిన్న ఢిల్లీలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రవాణా వ్యవస్థను విస్తృత పరచడానికి 50 వేల 655 కోట్ల రూపాయల వ్యయంతో తొమ్మిది వందల 36 కిలోమీటర్ల పొడవైన 8 హై–స్పీడ్ రహదారి కారిడార్ ప్రాజెక్టులకు ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఈ ప్రాజెక్టులు దేశవ్యాప్తంగా సరఫరా రవాణా వ్యవస్థకు దోహదపడతాయని, 2047 వికసిత భారత్ లక్ష్యానికి అనుగుణంగా ఉన్నాయని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం తగ్గించిన రాజధాని ప్రాంత పరిధిని మళ్లీ పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ–సీఆర్డీయే 36వ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గతంలో 130 సంస్థలకు జరిగిన భూ కేటాయింపులు, వాటి ప్రస్తుత పరిస్థితిపై చర్చించారు. సమావేశం అనంతరం రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ, 2015లో తెచ్చిన జీవో నెంబర్ 207 ప్రకారం 8 వేల 352 చదరపు కిలోమీటర్ల పరిధిలో రాజధాని ఉంటుందని వివరించారు. బాహ్య వలయ రహదారి నిర్మాణం, నాలుగు లైన్లుగా కరకట్ట నిర్మాణంపై ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి ఆదేశించారని మంత్రి పేర్కొంటూ…

వాయిస్ ( 33 సెకన్లు )

---------------------------

తెలంగాణలో క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని త్వరలో క్రీడా విధానం తీసుకొస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చెప్పారు. శాసన సభ సమావేశాల్లో నిన్న ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ నగరంలో మరో అంతర్జాతీయ క్రికెట్ మైదానాన్ని నిర్మిస్తామని, బేగరికంచలోని నైపుణ్య విశ్వవిద్యాలయానికి సమీపంలో ఈ నిర్మాణం చేపడతామని తెలిపారు. దీనిపై బీసీసీఐతో ప్రాథమిక చర్చలు పూర్తిచేశామని చెప్పారు. క్రీడల కోసం బడ్జెట్‌లో 321కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. వ్యసనాల నుంచి యువతను బయటకు తీసుకురావాలంటే క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, విద్యార్థులకు క్రీడలపై ఆసక్తిని పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని రేవంత్ రెడ్డి చెప్పారు.

---------------------------

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన 2024–25 జాబ్ క్యాలెండర్‌ను రాష్ట్ర శాసనసభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ సందర్భంగా శాసనసభలో ఆయన మాట్లాడుతూ, జాబ్ క్యాలెండర్‌ను రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదించామన్నారు. నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. అక్టోబర్‌లో ట్రాన్స్‌కో, డిస్కమ్‌ల ఇంజినీరింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తామన్నారు. అక్టోబర్ నెలలో ఏఈఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఉంటుందని వెల్లడించారు. గత పదేళ్ల కాలంలో ఉద్యోగాల నోటిఫికేషన్ల జాప్యం, తరుచూ వాయిదాలు ఇబ్బందికరంగా మారాయన్నారు. ఇప్పటికే టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి వివిధ పరీక్షలకు నోటిఫికేషన్లు ఇచ్చామని తెలిపారు. అభ్యర్థుల కోరిక మేరకు గ్రూప్–2 వాయిదా వేసిశామని భట్టి విక్రమార్క వివరించారు.

---------------------------

వరద జలాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఖరీఫ్ పంట సాగుకు అవసరమైన నీరు

అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జలవనరుల శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాగార్జునసాగర్, కృష్ణా డెల్టా కాలువలలో నీటిని చివరి ఆయకట్టుదారు వరకు సాగునీటిని అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రాజెక్టులకు సమృద్ధిగా వరద జలాలను పంపి పంటల సాగుకు వినియోగించుకుంటామని మంత్రి పేర్కొంటూ,..

వాయిస్ (26 సెకన్లు)

---------------------------

ఈరోజు జాతీయ అవయవ దాన అవగాహన దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అవయవాలను దానం చేస్తే ఎంతోమందికి పునః జీవితాన్ని ప్రసాదించవచ్చనే అంశం పట్ల అవగాహన కలిగించేందుకు ప్రతీఏటా మన దేశంలో ఆగష్టు 3వ తేదీన అవయవ దాన అవగాహన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఏ వయసువారైనా అవయవదానం చేయవచ్చు. సహజంగా మరణించినా, రోడ్డు ప్రమాదంలో మరణించినా, బ్రెయిన్ డెడ్ అయినా, వారి అవయవాలను అవసరమైనవారికి అమర్చడం ద్వారా వారికి నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ సంచికలో అవయవదాన విశిష్టతను గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రాణాపాయంలో వున్న వారిని కాపాడే మహత్తర కార్యక్రమమైన అవయవదానం చేసేందుకు మరింత మంది ముందుకు రావాలని ప్రధానమంత్రి పిలుపునిస్తూ....

వాయిస్ ...35 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి – ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణను ఎంపిక చేసినట్లు ఆ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నిన్న తాడేపల్లిలో ఉమ్మడి విశాఖ జిల్లా నాయకులతో జగన్మోహన్ రెడ్డి సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ నాయకులంతా కలిసికట్టుగా పని చేయాలన్నారు. సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఇలా ఉండగా ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 30న ఉప ఎన్నిక జరగనుంది. విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల మున్సిపల్ కార్పొరేషన్లు, జెడ్పీ, మండల పరిషత్ సభ్యులు ఈ ఎన్నికల్లో ఓటు వేయనున్నారు. సెప్టెంబరు 3న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

---------------------------

వారం వారం ప్రపంచవ్యాప్తంగా జరిగిన వార్త విశేషాలు, వివిధ అంశాల సమాచారంతో అంతర్జాతీయ విషయాలన్నటిని తెలుగులో అందించేందుకు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన వసుదైక కుటుంబం ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

=====================